క్లుప్తంగా

బొడ్డెమ్మ వేడుకలు



కేసముద్రం: మండలంలోని తాళ్లపూసపల్లి గ్రామంలో గురువారం రాత్రి బొడ్డెమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మహిళలు ఆడి, పాడి సందడి చేశారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



కేసముద్రం : ప్రతి విద్యార్థి చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని కల్వల జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బండారు నరేందర్ అన్నారు. గురువారం మున్సిపల్ పరిధిలోని సెయింట్ జాన్స్ హైస్కూల్‌లో 69వ ఎస్‌జీఎఫ్ఐ మండల స్థాయి అండర్-14, 17 విభాగాల నుంచి బాల,బాలికల కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ ఎంపిక క్రీడా పోటీలను ప్రారంభించారు. హెచ్‌ఎం రాజశేఖర్, శ్రావణ్‌రెడ్డి, పీడీ కొమ్ము రాజేందర్, కొప్పుల శంకర్, విజయ్‌చందర్, పద్మ, రవి, లలిత, స్రవంతి, మహేష్ పాల్గొన్నారు.

భూతగాదాలో ఇరువర్గాల ఘర్షణ

మహబూబాబాద్ రూరల్ : భూతగదా విషయంలో ఇరువర్గాలు ఘర్షణకు పాల్పడిన సంఘటన మహబూబాబాద్ మండలంలోని అయోధ్యలో గురువారం చోటుచేసుకుంది. అయోధ్య గ్రామానికి చెందిన పలువురు కొనుగోలు చేసిన భూమి విషయంలో కొంతకాలం నుంచి వాగ్వివాదాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో పలుమార్లు పెద్దమనుషుల పంచాయితీలు జరుగగా సమస్య పరిష్కారం కాలేదు. ఆ ఇరువర్గాల కుటుంబ సభ్యులు భూమి వద్దకు వెళ్లగా ఘర్షణ చోటుచేసుకుని ఒకరిపై ఒకరు పరస్పరం దాడికి పాల్పడ్డారు. పలువురికి గాయాలయ్యాయి. బాధితులు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా విచారణ చేస్తున్నారు.

దుస్తుల పంపిణీ



మహబూబాబాద్ రూరల్ : మండలంలోని బ్రాహ్మణపల్లి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు మహబూబాబాద్ పట్టణానికి చెందిన దాత సహకారంతో టీపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి మైస శ్రీనివాస్, జూలకంటి ప్రభాకర్ గురువారం దుస్తులు పంపిణీ చేశారు. ధరావత్ భద్రు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్నిక



శ్రీనివాస్‌గౌడ్

గార్ల : గార్ల పట్టణ కల్లుగీత కార్మిక సంఘం అధ్యక్షుడిగా తోడేటి శ్రీనివాస్‌గౌడ్‌ను గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మర్రిగూడెం రోడ్డులోని తాటిచెట్ల వనంకు కల్లుగీత కార్మిక సంఘం అధ్యక్షుడిగా గాజుల కృష్ణను ఎన్నుకున్నారు.

హమాలీ యూనియన్..

బయ్యారం : హమాలీ యూనియన్ (సీఐటీయూ) మండల అధ్యక్షుడిగా వెన్ను మోహన్, ఉపాధ్యక్షుడిగా సోమిరెడ్డి, శ్రీను, ప్రధాన కార్యదర్శిగా పురుషోత్తం, సహాయ కార్యదర్శిగా గజ్జి అప్పయ్య, తోట వీరన్నతో పాటు పలువురు సభ్యులతో కమిటీని ఎన్నుకున్నారు. సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి ఉపేందర్ పాల్గొని మాట్లాడారు.

ఆర్టీసీ డీఎంకు వీడ్కోలు



నెహ్రూసెంటర్: మహబూబాబాద్ ఆర్టీసీ డీఎం ఎం.శివప్రసాద్ బదిలీపై వెళ్తుండగా గురువారం డిపో ఆవరణలో ఆర్టీసీ ఉద్యోగులు వీడ్కోలు పలికారు. శివప్రసాద్ దంపతులను సిబ్బంది సన్మానించారు. అనంతరం డీఎం శివప్రసాద్ మాట్లాడుతూ.. ఆర్టీసీ డిపో అభివృద్ధికి సిబ్బంది, ఉద్యోగులు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారని తెలిపారు.

ఉద్యోగికి విరమణ సహజం



మరిపెడ : ఉద్యోగికి విరమణ సహజమని మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. గురువారం మరిపెడ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పని చేసిన మండాది రామచంద్రు పదవీ విరమణ అభినందన సన్మాన కార్యక్రమానికి నర్సిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా రామచంద్రు దంపతులను సన్మానించారు.

బీటీ రోడ్డుకు మోక్షమెప్పుడో..!

- కంకర పోశారు.. తారు మరిచారు
- నిలిచిన రోడ్డు నిర్మాణ పనులు
- ఇబ్బంది పడుతున్న రైతులు, ప్రజలు



చిన్నగూడూరు నుంచి జయ్యారం వరకు కంకర పోసి వదిలేసిన బీటీ రోడ్డు

చిన్నగూడూరు : మండలంలోని చిన్నగూడూరు నుంచి జయ్యారం వరకు నిర్మిస్తున్న బీటీ రోడ్డు పనులు పూర్తికాలేదు. దీంతో రోడ్డుపై పరిచిన కంకరతో ప్రజలు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

రూ.4 కోట్ల నిధులు కేటాయింపు..

మండల కేంద్రంలోని దాశరథి సెంటర్ నుంచి ఎస్సీ కాలనీ మీదుగా జయ్యారం సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహం వరకు డొంకదారిపై గత ప్రభుత్వ హయాంలో బీటీ రోడ్డు మంజూరు చేశారు. ఈ రోడ్డు నిర్మాణానికి 2023, సెప్టెంబర్ 2న ఆర్‌డీఎఫ్ నిధుల నుంచి రూ.4 కోట్లు కేటాయించి 5 కిలోమీటర్ల వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులను మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ శంకుస్థాపన చేసి ప్రారంభించారు. చుట్టు పక్కల గ్రామాల వారు నేరుగా మండల కేంద్రానికి దూరభారం తగ్గుతుందని సంతోషించారు. కానీ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. సదరు కాంట్రాక్టర్ పనులు మొదలు పెట్టి మొరంతో రోడ్డు లెవల్ పూర్తి చేసి కంకర పరిచారు. పనులు మొదలు పెట్టి రెండేళ్లు గడుస్తున్నా నేటికీ రోడ్డు నిర్మాణ పనులు పూర్తి కాకపోవడంతో రెండు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వాలు మారడంతో రోడ్డు పనుల్లో పురోగతి లేదని చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్ బీటీ రోడ్డు పనులు నిలిపివేసినట్లు స్థానికులు చర్చిస్తున్నారు. రోడ్డుపై కంకర తేలి ఉండటంతో పంట పొలాల వద్దకు వెళ్లేందుకు రైతులు, వ్యవసాయ కూలీలు, పశువులు నానా అవస్థలు అనుభవిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి బీటీ రోడ్డు పనులు వెంటనే పూర్తి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం..



రోడ్డుపై కంకర తేలి ఉండటంతో చేను వద్దకు వెళ్లలేక ఇబ్బంది పడుతున్నాం. చిన్నగూడూరు, జయ్యారం గ్రామాలకు చెందిన రైతులు వ్యవసాయ పనులకు వెళ్లాలన్నా, పండిన పంటలను ఇంటికి చేర్చాలన్నా సరైన రోడ్డు సౌకర్యం లేదు. ఏళ్ల తరబడి తిప్పలు తప్పడం లేదు. రైతుల కష్టాలను గుర్తించి వెంటనే బీటీ రోడ్డు పనులు పూర్తి చేయాలి.

– కొత్త శేఖర్, రైతు, చిన్నగూడూరు

గిరిజనుల సాధికారతకు 'ఆదికర్మయోగి'

- జెడ్పీ సీఈఓ పురుషోత్తం



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ పురుషోత్తం

మహబూబాబాద్ అర్బన్ : గిరిజనులకు సాధికారత కల్పించడం, ప్రతిస్పందనాత్మక పాలన బలోపేతం చేయడమే ఆదికర్మయోగి అభియాన్ అని జెడ్పీ సీఈఓ పురుషోత్తం అన్నారు. స్థానిక గిరిజన భవన్‌లో గురువారం జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆదికర్మయోగి అభియాన్ మిషన్ శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన హాజరై మాట్లాడుతూ.. గిరిజనలకు కేంద్ర ప్రభుత్వ పథకాలు చేరువయ్యేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. అనంతరం గిరిజన సంక్షేమ శాఖ ఉపసంచాలకులు గుగులోత్ దేశీరాం మాట్లాడుతూ.. ఆదికర్మ అభియాన్ కార్యక్రమంపై మిషన్ భగీరథ, విద్య, వైద్య, డీఆర్డీఓ, గిరిజన సంక్షేమ, మహిళ సంక్షేమ, అటవీ, పంచాయితీరాజ్ శాఖ అధికారులు తండాల్లో కనీస వసతులపై అక్కడి యువత, మహిళలు, నిరుద్యోగులను, ఉద్యోగుల సలహాలు తీసుకొని వారికి కావాల్సిన అవసరాలు తెలుసుకొని అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో శిక్షణ సహాయ గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఆర్.భాస్కర్, జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ ఎ. శ్రీకాంత్, సీడీపీఓ నీలోఫర్‌అజ్మీ, నిర్వాహకులు ప్రవీణ్‌కుమార్, శ్రీనివాస్‌రావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ అక్రమాలపై విచారణ చేపట్టాలి

- జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ బిందు



సమావేశంలో మాట్లాడుతున్న బిందు

బయ్యారం : బయ్యారం సొసైటీలో జరిగిన అక్రమాలపై కలెక్టర్ ప్రత్యేక అధికారితో విచారణ చేయించాలని జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ బిందు కోరారు. గురువారం బయ్యారంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. సొసైటీ అధ్యక్షుడు మధుకర్‌రెడ్డి కార్యాలయంలోనే అనేక పంచాయితీలు, సెటిల్‌మెంట్లు, దందాలు చేశారని అన్నారు. సొసైటీ రికార్డులను స్వాధీనం చేసుకొని దుర్వినియోగం చేసిన నిధులను రికవరీ చేయాలన్నారు. సమావేశంలో సొసైటీ మాజీ ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, బీఆర్‌ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అలాగే బయ్యారం సొసైటీ పాలకవర్గం రద్దుపై రైతులు ఆందోళన చెందొద్దని కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. బయ్యారంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.

అంగన్‌వాడీలు సమయపాలన పాటించాలి

- సీడీపీఓ లక్ష్మి



అంగన్‌వాడీలు, సూపర్‌వైజర్ల మానవహారం

గార్ల : అంగన్‌వాడీ టీచర్లు సమయపాలన పాటిస్తూ, పిల్లలకు మెనూ ప్రకారం పోషక విలువలతో కూడిన ఆహార పదార్థాలు వడ్డించాలని ఐసీడీఎస్ సీడీపీఓ డి.లక్ష్మి సూచించారు. గురువారం గార్ల హైస్కూల్‌ల్లో మూడ్రోజులుగా కొనసాగుతున్న అంగన్‌వాడీ టీచర్ల శిక్షణ ముగింపు సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల సంఖ్యను పెంచేందుకు టీచర్లు, ఆయాలు కృషి చేయాలన్నారు. నవచేతన, ఆదార్మణ్ శీల, పోషణ ఆరోగ్య విద్యపై టీచర్లకు శిక్షణ ఇచ్చారు. అనంతరం అంగన్‌వాడీ టీచర్లచే మానవహారం నిర్మించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు సంపూర్ణ, అనిత, ఉషారాణి, టీచర్లు నీలాదేవి, పద్మ, కృష్ణకుమారి, సరిత, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మించాలి



నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

నెహ్రూసెంటర్ : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్ నుంచి రైల్వే గేటుకు వెళ్లే దారిలో సీసీ రోడ్డును నిర్మించాలని సీపీఐ మున్సిపల్ మాజీ ఫ్లోర్‌లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి అన్నారు. సీసీరోడ్డు నిర్మించాలని డిమాండ్ చేస్తూ గురువారం నిరసన తెలిపారు. పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, మామిండ్ల సాంబలక్ష్మి, వెలుగు శ్రావణ్, ఎండి.ఫాతిమా, అశోక్, మంద శంకర్, శ్రీనాథ్, ఎర్రోజు పద్మ, పాల్, తండ మాధవి తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ బియ్యం తరలింపుపై విచారణ



కేజీబీవీలో వర్కర్‌ను విచారిస్తున్న జీసీడీఓ

గూడూరు : మండలంలోని బ్రాహ్మణపల్లి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో గురువారం జీసీడీఓ, కేజీబీవీల పర్యవేక్షకురాలు విజయకుమారి విచారణ చేపట్టారురు. బుధవారం కేజీబీవీకి సంబంధించిన 10 బస్తాలు (5క్వింటాలు) బియ్యం తరలిస్తూ పట్టుబడిన విషయం తెలిసిందే. డీఈఓ ఆదేశాల మేరకు బ్రాహ్మణపల్లికి చేరుకున్న జీసీడీఓ, ఎంఈఓ జె.రవికుమార్, సివిల్ సప్లయ్ అధికారితో కలిసి ముందుగా ఇప్పల్‌తండాలో బస్తాలు నిల్వచేసిన ఇంటి యజమానిని విచారించారు. అక్కడ నుంచి కేజీబీవీలో వర్కర్లను అడిగి తెలుసుకున్నారు. నివేదికలను ఉన్నతాధికారులకు అందిస్తామని తెలిపారు.

బాధ్యులపై చర్య తీసుకోవాలి: ఎస్ఎఫ్ఐ

కేజీబీవీ నుంచి అక్రమంగా 10 బస్తాల బియ్యం తరలించిన బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గంధసిరి జ్యోతిబసు డిమాండ్ చేశారు. మండలంలోని బ్రాహ్మణపల్లి కేజీబీవీ ఎదుట గురువారం వారు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బస్తాలు తరలింపునకు అసలైన కారకులు ఎవరో విచారణ చేపట్టకుండా, అధికారులు వర్కర్లపై నిందమోపడం పద్ధతి కాదన్నారు. నాయకులు ఎండీ అమీర్, కొలపాక వీరేందర్, వంశీ, సమీర్, తరుణ్, అభిలాష్ పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి



గూడూరు: అవగాహన కల్పిస్తున్న డాక్టర్ నవత



మరిపెడ రూరల్: తాళ్లఊకల్‌లో..

మరిపెడ రూరల్ : మహిళలు వారి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని పల్లె దవాఖానా వైద్యురాలు ఝాన్సీ అన్నారు. స్వస్థ్ నారి.. సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం మరిపెడ మండలం తాళ్లఊకల్ గ్రామంలో మరిపెడ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో సిబ్బంది కృష్ణ, ఆచార్యులు, హెల్త్ అసిస్టెంట్ వీరయ్య, ఆశవర్కర్లు రోజామణి, ధనమ్మ, లలిత పాల్గొన్నారు.

ప్రత్యేక వైద్యశిబిరం

గూడూరు : మండలంలోని అప్పరాజ్‌పల్లి ఆయుష్మాన్ ఆరోగ్యమందిర్‌లో గురువారం అయోధ్యపురం పీహెచ్‌సీ వైద్యురాలు యమున ఆధ్వర్యంలో స్వస్థ్ నారి..సశక్త్ పరివార్ అభియాన్ ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు.ఈ సందర్భంగా గూడూరు సీహెచ్‌సీ స్త్రీల వైద్య నిపుణురాలు, గైనకాలజిస్టు డాక్టర్ నవత మహిళలకు వచ్చే వ్యాధులు, 12 రకాల పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు అందించారు. జిల్లా ఎంసీహెచ్ పోగ్రాం అధికారి డాక్టర్ సారంగం, ఎండి షీరాజ్, ప్రతిమ హెచ్‌ఈఓ లోక్య, గణేష్, సర్దార్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

గంగారం : స్థానిక పీహెచ్‌సీలో స్వస్థ్ నారి..సశక్త్ పరివార్ అభియాన్ ప్రత్యేక వైద్యశిబిరం గురువారం నిర్వహించినట్లు వైద్యాధికారి ప్రత్యూష తెలిపారు. ఈ వైద్యశిబిరంలో స్త్రీ వైద్యనిపుణులు సునీత హాజరై మహిళలకు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.

సమ్మెకు సంఘీభావం

గార్ల : తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆశ్రమ పాఠశాలల వర్కర్లు చేస్తున్న సమ్మె శిబిరాన్ని గురువారం సీపీఎం, సీపీఐ, బీఆర్‌ఎస్ పార్టీల నాయకులు సందర్శించి సమ్మెకు సంఘీభావం తెలిపారు. గంగావత్ లక్ష్మణ్‌నాయక్, కందునూరి శ్రీనివాసరావు, కట్టెబోయిన శ్రీనివాసరావు ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

మైక్‌సైట్ బహూకరణ

పెద్దవంగర : ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి, విద్యార్థుల భవిష్యత్ కోసం లయన్స్‌క్లబ్ చేస్తున్న కృషి అభినందనీయమని హెచ్‌ఎం బానోతు భీమా నాయక్ అన్నారు. లయన్స్‌క్లబ్ తొర్రూరు ఆధ్వర్యంలో డిస్ట్రిక్ట్ గవర్నర్ దంపతులు లయన్ చంద్రశేఖర్ ఆర్య-రాజేశ్వరి జన్మదినం సందర్భంగా గురువారం మండలంలోని అవుతాపురం ప్రాథమిక పాఠశాలకు రూ.18 వేల విలువైన మైక్‌సెట్‌ను బహూకరించారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

పెద్దవంగర : స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని ఎంపీడీఓ వేణుమాధవ్ సూచించారు. గురువారం మండలంలోని కేజీబీవీలో విద్యార్థులకు అవగాహన పెంచేందుకు వ్యాసరచన పోటీ నిర్వహించామని తెలిపారు.

శివాలయంలో స్వచ్ఛభారత్

కేసముద్రం : బీజేపీ సేవా పక్షం కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని కాట్రపల్లి శివాలయంలో ఆ పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పరికిపండ్ల అశోక్ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ నిర్వహించారు. ఆలయం చుట్టు చెత్తచెదారాన్ని తొలగించారు.

ఉద్యమకారులకు న్యాయం చేయాలి

నెల్లికుదురు : తెలంగాణ రాష్ట్రం సాధనకు కృషిచేసిన ఉద్యమకారులకు న్యాయం చేయాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు కుమ్మరికుంట్ల మౌనేందర్ కోరారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. గుండ వెంకన్న, పుల్లయ్య, సాయన్న, సైదులు, ప్రకాశ్, ప్రశాంత్, మద్ది వెంకన్న, కొమురయ్య, అశోక్, ఎల్లయ్య పాల్గొన్నారు.

గోపాలమిత్ర భవనాన్ని తెరిపించాలి

మరిపెడ రూరల్: మండలంలోని నీలికుర్తిలో ప్రారంభం కానీ గోపాలమిత్ర భవనాన్ని తెరిపించి పశువులకు వైద్యం అందుబాటులోకి తేవాలని మరిపెడ మండల సీపీఐ కార్యదర్శి మారగాని బాలకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా పశు వైద్యాధికారి కిరణ్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

యూరియా అందించాలి

నెల్లికుదురు : పట్టాదారు పాస్‌పుస్తకాలు లేని రైతులకు యూరియా అందించాలని ఇనుగుర్తి మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ కోరారు. గురువారం విలేకరులతో ఆయన మాట్లాడారు. వ్యవసాయ అధికారులు పట్టాపాస్ పుస్తకాలు ఉన్న రైతులకే యూరియా అందిస్తున్నట్లు తెలిపారు.

వలకు చిక్కిన కొండచిలువ

దంతాలపల్లి : చేపల వలకు గురువారం కొండచిలువ చిక్కింది. మండలంలోని నిదానపురం చెరువులో మత్స్యకారుడు చేపల కోసం వల వేశాడు. కొంత సమయం తర్వాత వెళ్లి వలను తీశాడు. బలంగా రావడంతో మత్స్య కారుడు వెలుపలికి తీసి చూశాడు. అప్పటికే వలలో కొండచిలువ చిక్కుకోని ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు. పక్కనే పాలేరు వాగు ఉండడంతో చెరువులోకి వచ్చి ఉంటుందని గ్రామస్తులు చెబుతున్నారు.

విజయవంతం చేయాలి

కేసముద్రం : మున్సిపల్ పరిధి కేసముద్రంస్టేషన్‌లో నిర్వహించనున్న దసరా పండుగ ఉత్సవాలను అందరి సహకారంతో విజయవంతం చేయాలని గురువారం స్థానిక రామమందిరంలో మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామపెద్దలు, వివిధ పార్టీల నాయకులు తీర్మానించారు. అల్లం నాగేశ్వర్‌రావు, జాటోత్ హరీష్ నాయక్, బచ్చు పరమేశ్వర్, ముత్యాల శివకుమార్, తరాల వీరేష్ యాదవ్, పోలెపాక నాగరాజు, వెంకటేశ్వర్లు, మురళీ, సత్యనారాయణ, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

వృద్ధదంపతుల ఇంట్లో చోరీ
కళ్లల్లో కారం చల్లి దొంగ పరారీ

కొత్తగూడ : మండలంలోని ముస్మి గ్రామానికి చెందిన వృద్ధ దంపతులు మాంజ్య, బంగారి ఇంటి వరండాలో నిద్రిస్తున్నారు. గురువారం రాత్రి దొంగ వారి ఇంట్లోకి చొరబడి రూ.5వేల నగదును దొంగతనం చేశాడు. అనంతరం బంగారి మెడలో ఉన్న పుస్తెల తాడు లాక్కెళ్లేందుకు యత్నిస్తుండగా ఆమె మేల్కొని పట్టుకునే ప్రయత్నం చేస్తూ గట్టిగ అరిచింది. దీంతో బంగారి కళ్లల్లో కారం చల్లి దొంగ పారిపోయాడు. ఈ ఘటనపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు.

ప్రమాదకర గుంతల పూడ్చివేత



తొర్రూరు: మట్టి పోసి చదును చేస్తున్న సిబ్బంది



డోర్నకల్: గుంతలు పూడ్చుతున్న పోలీసులు

తొర్రూరు : తొర్రూరు నుంచి పెద్దవంగర మీదుగా తిరుమలగిరికి వెళ్లే జాతీయ రహదారి ఇటీవల కురిసిన వర్షాలకు గుంతలమయంగా మారింది. అటువైపు వెళ్లే ద్విచక్ర వాహనదారులు, స్థానికులు అదుపు తప్పి పడి గాయాలపాలవుతున్నారు. దీంతో స్థానికులు పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి దృష్టికి తీసుకురాగా స్పందించి నేషనల్ హైవే అధికారులకు ఫోన్ చేసి సమస్య పరిష్కరించాలని సూచించారు. స్పందించిన అధికారులు తొర్రూరు శివారులోని ఎర్రసోమ్లా తండా సమీపంలో ట్రాక్టర్లతో కంకర పోసి మట్టితో నింపి గుంతలను పూడ్చారు. స్పందించిన ఎమ్మెల్యేకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

డోర్నకల్ : అమ్మపాలెం క్రాస్ రోడ్డుపై ఏర్పడిన గుంతలను గురువారం డోర్నకల్ పోలీసులు పూడ్చారు. భారీ గుంతలు ఏర్పడి వాహనదారులు ఇబ్బందులు పడుతుండటం, వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలు జరుగుతుండటంతో సీఐ చంద్రమౌళి, ఎస్సై ఖాదర్‌పాషా ఆధ్వర్యంలో పోలీసులు మట్టి, కంకర పోసి గుంతలు పూడ్చారు.

విద్యుత్ కేబుల్ ధ్వంసం



11 కేవీ విద్యుత్ కేబుల్‌ను అమర్చుతున్న సిబ్బంది

- తొమ్మిది రోజులుగా నిలిచిన సరఫరా..



ధ్వంసమైన కేబుల్‌ను చూపుతున్న రైతులు (ఇన్‌సెట్‌లో)

డోర్నకల్ : డోర్నకల్ సమీపంలోని మున్నేరు వాగుపై నిర్మించిన సీతారామ ప్రాజెక్ట్ అక్విడెక్ట్ బ్రిడ్జి కింద విద్యుత్ కేబుల్ ధ్వంసమైంది. దీంతో తొమ్మిది రోజులుగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ లైన్ పరిధిలో పంటలు ఎండిపోతుండడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మున్నేరువాగు ఒడ్డున ట్రాన్స్‌ఫార్మర్ నుంచి విద్యుత్ స్తంభాలకు సుమారు 140 మీటర్ల పరిధిలో లైన్ ఏర్పాటు చేశారు. 2020లో సీతారామ ప్రాజెక్ట్ అక్విడెక్ట్ బ్రిడ్జి నిర్మాణానికి కాంట్రాక్టర్లు రెండు స్తంభాలను తొలగించి బ్రిడ్జి కింది నుంచి ఎల్‌టీ కేబుల్ ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరా చేశారు. ఇటీవల మున్నేరువాగుకు వరద ప్రవాహం రావడంతో పాటు ట్రాక్టర్ల రాకపోకలతో ఎల్‌టీ కేబుల్ ధ్వంసమై విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. తొమ్మిది రోజులుగా విద్యుత్ సరఫరా లేకపోవడంతో రైతులు ప్రాజెక్ట్ సిబ్బందిపై ఒత్తిడి తేవడంతో రెండ్రోజులు డీజిల్ జనరేటర్ సాయంతో విద్యుత్ సరఫరా చేసి తర్వాత ఆపివేశారు. రైతులు విద్యుత్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో గురువారం ఆ శాఖ ఏఈ కిరణ్‌తో వెళ్లి తెగిన కేబుల్‌ను పరిశీలించారు. సీతారామ సిబ్బంది నూతన 11 కేవీ కేబుల్‌ను అమర్చే పనులు చేపట్టారు. విద్యుత్‌శాఖ సిబ్బందితో పాటు సీతారామ ప్రాజెక్ట్ సిబ్బంది నిర్లక్ష్యంతో తమ పంటలు ఎండుతున్నాయంటూ రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

నిధులు రావు.. పనులు కావు

- మూడేళ్లుగా పూర్తికాని నిర్మాణాలు
- నిరుపయోగంగా తొర్రూరులోని కాంప్లెక్స్
- పూర్తి చేసి, ప్రారంభించాలని చిరు వ్యాపారుల వేడుకోలు



తొర్రూరులో నిర్మాణ దశలో ఉన్న కాంప్లెక్స్

తొర్రూరు రూరల్ : డివిజన్ కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్ పరిధిలో తొర్రూరు నుంచి నర్సంపేటకు వెళ్లే రోడ్డు పక్కన నిర్మిస్తున్న కాంప్లెక్స్ నిధులు లేక నిరుపయోగంగా మారాయి. అనేక ఏళ్లుగా చిరు వ్యాపారులు ఇక్కడ డబ్బాలు ఏర్పాటు చేసుకొని వ్యాపారాలు చేస్తు జీవనాన్ని సాగిస్తున్నారు. ఈక్రమంలో ఐదేళ్ల క్రితం అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రజాప్రతినిధులు, అధికారులు ఇనుప డబ్బాలను తొలగించి కాంప్లెక్స్ నిర్మిస్తామని, నిర్మాణాలు పూర్తి చేసిన తర్వాత కాంప్లెక్స్‌లను చిరు వ్యాపారులకే కేటాయిస్తామని హామీలు ఇచ్చి, డబ్బాలను తొలగించారు. హైస్కూల్ నిధులు రూ.45 లక్షలతో నిర్మాణ పనులను చేపట్టారు. ఇప్పటికి 90శాతం పనులను పూర్తి చేసిన ఒక్క రూపాయి కూడా సంబంధిత కాంట్రాక్టర్‌కు విడుదల కాకపోవడంతో నిర్మాణ పనులను మధ్యలోనే నిలిపివేశారు. అయితే పనులపై కొత్త ప్రభుత్వంలోని అధికారులు, ప్రజాప్రతినిధులు ఎవరు పట్టించుకోకపోవడంతో నిర్మాణాలు పూర్తికాక ప్రారంభానికి నోచుకోవడం లేదు.

నిర్మాణాలను పూర్తి చేయాలని వేడుకోలు

మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న కాంప్లెక్స్ నిర్మాణ పనులను పూర్తి చేసి, తమకు కేటాయించాలని చిరు వ్యాపారులు వేడుకుంటున్నారు. అనేక ఏళ్లుగా రోడ్డు పక్కన డబ్బాలు ఏర్పాటు చేసి చిన్న, చిన్న వ్యాపారాలతో జీవిస్తున్న తమ కుటుంబాలను రోడ్డున పడేశారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎండ, వానకు సైతం గొడుగులు పెట్టుకోని నిత్యం తీవ్ర ఇబ్బందులు పడుతూ వ్యాపారాలు చేసుకుంటూ బతుకుతున్నామని తెలిపారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కాంప్లెక్స్ నిర్మాణ పనులను పూర్తి చేసి, వెంటనే ప్రారంభించి ఆదుకోవాలని చిరువ్యాపారులు కోరుతున్నారు.

పత్తి పంటకు మద్దతు ధర కల్పించాలి

- రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నచంద్రన్న



నెహ్రూసెంటర్ : కేంద్ర ప్రభుత్వం పత్తి క్వింటాకు రూ.10,075 మద్దతు ధర నిర్ణయించి అమలు చేయాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాయం చిన్న చంద్రన్న డిమాండ్ చేశారు. ఈనెల 23వ వరకు నిర్వహించనున్న రైతుల మద్దతు ఆందోళన కరపత్రాలను గురువారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో ఆవిష్కరించారు. వర్షాల వల్ల పంటలు దెబ్బతిన్న రైతులకు రూ.50 వేల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రధాన కార్యదర్శి ఆవుల కట్టయ్య, జక్కుల యాకయ్య, గద్దల వెంకటయ్య, బూర్గుల మోష, దొడ్డ కేశవులు పాల్గొన్నారు.